RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 24 | డిసెంబర్ 27, 2025 | వెల : రూ.3-00




రైల్వే ప్రయాణికులకు షాక్.. 4లో..

# అడ్డొస్తే.. అంతమే!

- వివాహేతర సంబంధాల మోజులో హత్యలు
- భర్తలను అతి కిరాతకంగా చంపేస్తున్న కొంతమంది భార్యలు



- ☐ తాజాగా ఉత్తర ప్రదేశ్ శంబల్లో సంచలన ఘటన
- ☐ భర్తను ముక్కలు చేసి.. గ్రౌండర్లో వేసి రుబ్బి..
- ☐ రుణమాఫీ కోసం ప్రియుడితో కలిసి భర్త మర్డర్
- ☐ మహబూబాబాద్లో వెలుగు చూసిన మరో ఘటన
- ☐ పాశ్చత్య మోజు.. సోషల్ మీడియా ప్రభావం
- ☐ అర్థంలేని పనులతో కుటుంబాలు బలి
- ☐ అడ్డొస్తున్నారని పిల్లలనూ హతమారుస్తున్న పైశాచికం
- ☐ ఎంత ప్లాన్ చేసినా టెక్నాలజీతో అడ్డంగా దొరికేస్తున్న కిరాతకులు

3లో..

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

ఒకప్పుడు జీవితం అనే ప్రయాణానికి దిశానిర్దేశం చేసిన వివాహ బంధం.. ఇప్పుడు అనేక చోట్ల రక్తంతో మసకబారుతోంది. ప్రేమ, విశ్వాసం, బాధ్యతలతో నడవాల్సిన కుటుంబ జీవితం, వివాహేతర సంబంధాల మోజులో అతి క్రూరమైన హత్యలుగా మారిపోతోంది. భర్తలను భార్యలు తమ ప్రియులతో కలిసి చంపేస్తున్న ఘటనలు, ఆ బంధానికి అడ్డుగా ఉన్నారన్న కారణంతో అభం శుభం తెలియని పిల్లల్నే బలి తీసుకుంటున్న దారుణాలు, తల్లిదండ్రులను సైతం కడతేర్చిన కేసులు ఎన్నో వెలుగు చూస్తున్నాయి. దేశం వాప్తంగా ఇటీవల ఇలాంటి ఘటనలు ఎన్నో సంచలనంగా మారగా.. ఇటీవల అలాంటి క్రూరమైన ఘటనే వెలుగు చూసింది. ఉత్తర ప్రదేశ్ శంబల్ జిల్లాలో ఓ కిరాతక హత్యోదంతం ఇప్పుడు వివాహ వ్యవస్థపైనే నమ్మకం కోల్పోయేలా చేస్తోంది. అంతే కాకుండా.. తాజాగా హౌస్ లోన్ మాఫీ కావాలన్న దురాశతో ప్రియుడితో కలిసి భర్తను పక్కా స్కెచ్ వేసి హతమార్చిన భార్య వ్యవహారం మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది.

# ఎగవేతల సీఎం

- పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యావు
- భాష మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయి
- మేం ఢిల్లీకి గులాం చేయలేదు.. పౌరుషంగా బతికాం
- కేసీఆర్ ను గెలవనివ్వక పోవడం నీ తరం కాదు
- ఈసారి నిన్ను కొడంగల్లో ఓడిస్తాం
- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు
- హామీల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీసిన బీఆర్ఎస్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ పేర్లపై ఒట్టు పెట్టి హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా ఎగవేశారని మండిపడ్డారు. నెలకు రూ. 2,500 ఇవ్వడానికి ముఖం లేదని, కానీ కోటి

మిగతా 3వ పేజీలో..

# న్యూ ఇయర్ జోష్ హద్దు మీరొద్దు

- 'జీరో డ్రగ్స్' విధానమే లక్ష్యం
- ఒంటిగంట వరకే వేడుకలకు పర్మిషన్
- నిబంధనలు ఉల్లంఘిస్తే పబ్‌లు, హోటళ్ల లైసెన్సులు రద్దు
- నగరమంతా కఠిన నిఘా, చెక్‌పోస్టులు
- హైదరాబాద్ సీపీ సజ్జనర్ స్పష్టమైన హెచ్చరిక

3లో..

# పురాణ పురుషుల గొప్పతనాన్ని పిల్లలకు చెప్పాలి

- అవతార్ కంటే రామాయణంమహాభారతం మహత్తరం
- 2047 నాటికి భారత్ సూపర్ పవర్ - ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

4లో..

# డీసీపై ఎంక్వయిరీ..!?

- 'వేద న్యూస్' కథనానికి స్పందన
- మహిళా సిబ్బంది ఫిర్యాదులపై కమిషనర్ సీరియస్!
- వరంగల్ జోన్ డీసీ వ్యవహారంపై విచారణ ప్రారంభం!



## 'డీసీ' రాజ్యమా?

- దేవాదాయ ధర్మదాయ శాఖలో దుమారం
- కారుణ్య నియామకాలలో అక్రమాలపై లేఖ కలకలం
- వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ పై తీవ్ర ఆరోపణలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

దేవాదాయ ధర్మదాయ శాఖలో వరంగల్ జోన్ పరిధిలో డీసీ అంతా నా ఇష్టం.. నాదే రాజ్యం అనే తీరులో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సదరు డిప్యూటీ కమిషనర్ పై మహిళా సిబ్బంది పేరుతో రాసిన లేఖ వాట్సాప్‌లో వైరల్ కావడంతో శాఖలో ఉద్రిక్తత నెలకొంది. డీసీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వరంగల్ జోన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగినులపై వేధింపులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని లెటర్‌లో పేర్కొన్నారు. మాజీ డీసీపై ఆరోపణల నేపథ్యంలో ఆయనను బదిలీ చేయగా, ఆయన బ్యాచ్‌మేట్, సన్నిహితురాలిని నూతన డీసీగా నియమించారు.

- మహిళా సిబ్బందిపైనే కక్ష?

మాజీ డీసీ బదిలీకి మహిళా సిబ్బందే కారణమన్న అనుమానంతో, వారిపైనే కక్షగట్టి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నెలకు ఒకరు లేదా ఇద్దరిని తరచూ బదిలీ చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, కొందరిని పలుమార్లు బదిలీ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని లేఖలో వివరించారు.భర్త మృతి అనంతరం కుటుంబ పోషణ కోసం కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన మహిళలను అవమానకరంగా మాట్లాడుతున్నారని, 'ఏమి వస్తది.. ఏమి రాదు' అంటూ హేళన చేస్తున్నారని ఆరోపించారు. బొట్టు, గాజులు, పూలు, పూజలు వంటి వ్యక్తిగత అంశాలపైనా వ్యాఖ్యలు చేస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని లేఖలో వెల్లడించారు. తోటి మహిళా సిబ్బందిపై వివాహేతర సంబంధాలున్నాయంటూ దుష్ప్రచారం చేస్తూ, ఒకరి దగ్గర మరొకరి విషయాలు చెప్పి పరువు నష్టం కలిగిస్తున్నారని, ఒక మహిళగా ఉండి మహిళల మనోభావాలను కూడా పట్టించుకోవడం లేదని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.

- ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు

డీసీ కార్యాలయంలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కక్షసాధింపుగా తొలగించారని, వారి స్థానంలో ముగ్గురిని కొత్తగా నియమించుకున్నారని ఆరోపించారు. అందులో ఒకరు మాజీ డీసీ వ్యక్తిగత డ్రైవర్‌గా పనిచేసిన ప్రైవేట్ వ్యక్తి కాగా, మరో వ్యక్తి అన్యమతస్తుడని లేఖలో పేర్కొన్నారు. ఈ నియామకాల కోసం రూ.3 లక్షలు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డీసీ నుంచి తమను కాపాడి, మంచి వ్యక్తిత్వం గల అధికారిని నియమించాలని మహిళా సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఈ లేఖలు అసల్యంగా వెలుగులోకి వచ్చాయి.



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

దేవాదాయ, ధర్మదాయ శాఖలో కలకలం రేపిన వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్‌పై మహిళా సిబ్బంది చేసిన ఆరోపణల వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి.! "డీసీ రాజ్యమా?" పేరిట "వేద న్యూస్" తెలుగు దినపత్రిక ప్రచురించిన కథనంపై డిపార్ట్మెంట్ వర్గాల్లో చర్చ జరిగినట్లు సమాచారం. దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపై ఆరోపణలపై విచారణ ప్రక్రియ ప్రారంభమైనట్టు విశ్వసనీయ సమాచారం.మహిళా ఉద్యోగుల వేధింపులు, కక్షసాధింపు చర్యలు, కారుణ్య నియామకాలలో అక్రమాలు, తరచూ బదిలీలు, అవమానకర వ్యాఖ్యలు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపులు, అనధికార నియామకాల అంశాలపై వివరాల సేకరణ మొదలైంది. సంబంధిత ఫైళ్లు, బదిలీ ఆదేశాలు, నియామకాల రికార్డులను విచారణ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**మహిళా సిబ్బంది వాంగ్మూలాలకు సిద్ధం**

లేఖలో పేర్కొన్న ఆరోపణలపై మహిళా సిబ్బంది వాంగ్మూలాలను రికార్డు చేయనున్నట్లు తెలుస్తోంది. వేధింపుల ఆరోపణలపై ప్రత్యక్షంగా బాధితుల నుంచి వివరాలు సేకరించేందుకు సోమవారం విచారణ కమిటీ ముందు హాజరుకానున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**తాత్కాలిక చర్యలపై చర్చ**

విచారణ పూర్తయ్యే వరకు మహిళా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక చర్యలు తీసుకునే అంశంపై ఉన్నతాధికారులు చర్చిస్తున్నట్లు తెలిసింది. అవసరమైతే బాధ్యతల మార్పు, పరిపాలనా నియంత్రణ వంటి చర్యలు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

**నివేదికపై కీలక నిర్ణయాలు?**


విచారణ కమిటీ నివేదిక అందిన వెంటనే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఉన్నత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# సీడ్ ఆర్గనైజర్ల నిలువు దోపిడీ

- మట్టి, బస్తా పేరుతో.. బ్యాగుకు రెండు కిలోలు..
- ఒకే కంపెనీకి చెందిన ఇద్దరు తలోరకంగా..
- అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి
- మార్కెట్ మాయాజాలంలో రైతు నష్టపోకూడదు
- తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భాస్కర్

**వేద న్యూస్, వరంగల్:**

జిల్లాలో పలు విత్తన కంపెనీలు వరి విత్తన ఉత్పత్తి కోసం రైతులకు, మేల్ ఫిమేల్ ఓపి వెరైటీ వరి విత్తన ఉత్పత్తి చేయిస్తున్నారనీ, అయితే కొందరు ఆర్గనైజర్లు అన్నదాతను నిట్టనిలువున దోపిడీ చేస్తున్నారని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ హింగే పేర్కొన్నారు. రైతుల నుండి ధాన్యం కొనేటప్పుడు బస్తకు కిలో, మట్టికి కిలో అని ..ఒక బస్తాకు రెండు కిలోల ధాన్యం కోత విధిస్తున్నారనీ ఆరోపించారు. ఇప్పుడు కోత సమయంలో హార్వెస్టర్లతో కోస్తున్నారు ఎండబెట్టుటకు పరదాలు వేసి ధాన్యాన్ని ఎండబెడుతున్నారనీ, ఇలాంటి అప్పుడు మట్టి ఎక్కడ కలుస్తుంది..? అని ప్రశ్నించారు. పూర్వకాలంలో మనుషులతో కోయించి ఎడ్లతో బంతి కొట్టినప్పుడు కళ్ళంలో పరదాలు వేసేవారు కాదు అప్పుడు పరదాలు లేవు.. కాబట్టి అప్పుడు ధాన్యంలో మట్టి కలిసేదనీ వివరించారు. మట్టికి కిలో అనేది వెంటనే తీసివేయాలనీ కోరారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బాధ్యులైన కంపెనీల పై సీడ్ ఆర్గనైజర్లపై చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. ఈ దోపిడీ సీడ్ ఆర్గనైజర్లు కంపెనీలు కలిసి ఆడుతున్న నాటకంపై ప్రభుత్వం స్పందించి బాధ్యులైన ఆర్గనైజర్లపై సీడ్ కంపెనీలపై దీనికి సహకరిస్తున్న మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో దీనిపై రైతులకు న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.




కొంత మంది రైతులు తన దృష్టికి ఈ విషయాలను తీసుకొచ్చారని చెప్పారు. ఒకే కంపెనీ కి చెందిన ఇద్దరు ఆర్గనైజర్లు.. ఒకరు ఒకరకంగా, మరొకరు మరో రకంగా దోపిడీ చేస్తున్నారనీ ఆరోపించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను .. మధ్యలో వారు దోచుకుంటున్నారనీ, దీని మీద అధికారులు స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని భాస్కర్ కోరారు.

# నూతన పాలకవర్గానికి సన్మానం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ నూతన పాలక వర్గానికి సన్మానం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ అయ్యన్న హరికృష్ణా రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో నూతన సర్పంచుగా ఎన్నికైన మామిడి రాజు, ఉపసర్పంచ్ మూగ నాగరాజు శర్మతోపాటు వార్డ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి రాజు మాట్లాడుతూ.. ట్రస్ట్ ఉపాధ్యక్షుడి అయిన తనకు ముప్పయి మూడు దేవతలకు నిలయమయిన గోమాతల సమక్షంలో సన్మానం జరగడం అదృష్ట భాగ్యం అన్నారు. గోశాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ నాగరాజు శర్మ మాట్లాడుతూ.. సృష్టిలో ముగ్గురు మాతలు ముఖ్యమని, వారి గొప్పదనం చాలా ఉందని అందులో భూమాత, గోమాత, మనకు జన్మనిచ్చిన తల్లి.. వీరు లేనిది సృష్టి లేదన్నారు. ట్రస్ట్ చైర్మెన్ హరికృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. గోసేవ చేసే భాగ్యం లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. పూర్వీకులు మనకు అందించిన గోవుల ద్వారా సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మాజీ సర్పంచ్ కూనబోయిన బాలరాజు మాట్లాడుతూ.. గోవులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్య



క్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు నార్ల రాంకిషన్, బోనగిరి రాము, నారెడ్డి, కిశోర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కేసరి కనకయ్య, చిట్టి ప్రదీప్ రెడ్డి మంద చక్రధర్ రెడ్డి, వార్డ్ సభ్యులు రేగుల కార్తీక్, రాకం సుమన్, మామిడి శ్రీనివాస్, ఎర్రోజు దీపిక రవితేజ, దయ్యాల శ్రీలత మహేష్, కొట్టే ప్రమీల వెంకన్న, మామిడి సుశీల, చేరాల వంశీ, అంతటి శ్రీకాంత్, గోమాతా సేవకులు వజ్జపల్లి మల్లేశం, కట్ట ఎల్లారెడ్డి, రాజస్థాన్ గణేష్, బత్తిని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు, డ్రైనేజీలు ఆక్రమిస్తున్నా పట్టించుకోరా?



- ఆదేశాలు పట్టించుకోని వ్యాపారులపై చర్య తీసుకోవాలి
- బీజేపీ సీనియర్ నాయకుడు అనంతస్వామి

**వేద న్యూస్, హుస్నాబాద్:**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో పలు చోట్ల డ్రైనేజీలు ఆక్రమణకు గురయ్యాయి. ఇష్టానుసారంగా ప్రజలను ఇబ్బంది పెడుతూ పలువురు వ్యాపారాలు చేస్తున్నారు. అలాగే దుకాణాల ఎదుట చిరు వ్యాపారుల పేరుతో వారి దగ్గర నుండి వేల రూపాయలు తీసుకొని దుకాణాల ముందు గల స్థలాన్ని కిరాయి ఇస్తున్నారు. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్, పోలీస్ శాఖకు సమాచారం ఇచ్చినా ఏమాత్రం ఫలితం లేకుండాపోయింది. ఇప్పటివరకు మున్సిపల్ కమిషనర్, పోలీస్ శాఖ అవగాహన కల్పించినా, రెండుసార్లు హెచ్చరించినా కూడా వ్యాపారుల తీరు మారడం లేదు. వ్యాపార వర్గాల వల్ల పార్కింగ్ లేకపోవడం వల్ల హైవే రోడ్డుపై వాహనాలు నిలపడంతో పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. వ్యాపారులకు రాజకీయ నాయకుల అండ దండలు ఉండడం వల్లే వారు అధికారులు, పోలీసుల ఆదేశాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్, పోలీస్ శాఖకు చిత్తశుద్ధి ఉంటే నిబంధనలు వ్యతిరేకిస్తున్న వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు వరియోగుల అనంత స్వామి డిమాండ్ చేస్తున్నారు.

## జీవాలకు నట్టల మందు పంపిణీ

**వేద న్యూస్, దామరచర్ల:**



దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గొర్రెలు, మేకలకు శుక్రవారం నులిపురుగుల నిరోధక మందును తాగించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల సంఘం అధ్యక్షురాలు గంగుల బంగారి, గ్రామ సర్పంచ్ ఎన్. శ్రావణి, పశు వైద్యులు డాక్టర్ సందీప్ కుమార్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన చిందు కళాకారుడు గజ్జెల నగదరయ్య అనారోగ్యంతో మృతి చెందగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. వీరి వెంట మాజీ ఎంపీటీసీ రాములు, శ్రీనివాస్, వేణు, స్వామి గౌడ్, లక్ష్మినరసయ్య, మురళి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## వార్డుల్లో పర్యటించిన సర్పంచ్ సునీత

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత సర్పంచ్ గా గెలవగానే గ్రామంలోని పలు వార్డుల్లో శుక్రవారం పర్యటించి కాలనీవాసుల బాధలను అడిగి తెలుసు కున్నారు. వార్డుల్లో మురికి కాలువలు, తాగు నీరు, వీధి లైట్ల సమస్యలను పరిశీలించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు మెంబర్లు వడ్ల నరేష్, అమృత, శివ తదితరులు ఉన్నారు.

## బాక్సింగ్ ఛాంపియన్ కు ఎమ్మెల్సీ సన్మానం

**వేదన్యూస్ దామరచర్ల :**




నల్గొండ జిల్లా స్థాయి బీఎఫ్ఏ నైన్త్ ఎలైట్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్లో సిల్వర్ మెడల్ ను దామరచర్లకు చెందిన దనావత్ అజయ్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అజయ్ కి ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ శుక్రవారం శాలువా కప్పి సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్ రవీందర్, జనరల్ సెక్రటరీ ప్రవీణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# చికడపల్లి సర్పంచ్ కు సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లయన్స్ కంటి ఆసుపత్రిలో జిల్లా గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు అధికారిక పర్యటనలో భాగంగా గవర్నర్ చే రుద్రూర్ లయన్స్ క్లబ్ సభ్యులు చిక్కడపల్లి గ్రామ సర్పంచ్ గా భారీ మెజారిటీతో ఎన్నికైన సందర్భంగా ఇంటర్నేషనల్ లయన్స్ పిన్ తో పాటు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ కంటి ఆసుపత్రుల వ్యవస్థాపకులు లయన్స్ మాజీ గవర్నర్ లయన్ పి.బసవేశ్వర రావు మాట్లాడుతూ.. చిన్న వయసులో ఉండి లయన్స్ క్లబ్ రుద్రూర్ సభ్యులుగా కొనసాగుతూ గ్రామంలో సర్పంచ్ గా పోటీచేసి భారీ మెజారిటీతో గెలవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒకటవ గవర్నర్ లయన్ విజయలక్ష్మి, రెండవ గవర్నర్ లయన్ నర్సింహ రాజు, ఇందూర్ స్కూల్స్ అధినేత లయన్ కొడాలి కిషోర్, కమ్మ సంగం అధ్యక్షుడు లయన్ శివన్నారాయణ, రుద్రూర్ క్లబ్ అధ్యక్షులు లయన్ కేవీ మోహన్, జిల్లా అధ్యక్షుడు లయన్ శ్యామ్ సుందర్ పహడే, సభ్యులు లయన్ పార్వతి ప్రశాంత్, లయన్ నారోజీ గంగాధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన పచ్చునూరు సర్పంచ్

**వేద న్యూస్, మానకొండూర్:**



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామ సర్పంచ్ పార్నంది కిషన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్లో ఆయనకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ కిషన్ తోపాటు వార్డు సభ్యులు తాళ్ల వెంకటేశ్, నెలవేణి సుశీల, కోమల్ల నరేష్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. పచ్చునూరు గ్రామ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. గ్రామ అవసరాల మేరకు చేపట్టే అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయిస్తానన్నారు. గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీ నూతన పాలకవర్గం ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని, ముఖ్యంగా విద్యుత్,పారిశుద్ధ్యం,డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చడం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పచ్చునూరు ఉప సర్పంచ్ మూడగాని అనిల్, వార్డు సభ్యులు పిట్టల సువర్ణ, పిట్టల మల్లేశం, దాసారం అనిత, పూసాల సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, బుర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్లోకి రుద్రవరం ఉప సర్పంచ్

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామ ఉపసర్పంచ్ బెజగం మహేష్, 10 వ వార్డు సభ్యుడు బాణాల రాజులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీనీ వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు చేతుల మీదుగా బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన రుద్రవరం ఉప సర్పంచ్ బెజగం మహేష్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, అభివృద్ధి కేవలం కేసీఆర్ తోనే సాధ్యమన్నారు. అలాగే వేములవాడ నియోజకవర్గం అభివృద్ధి చల్మెడ తోనే జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి, వార్డు సభ్యులు అలిపిరి సురేష్, గ్రామశాఖ అధ్యక్షుడు హరికృష్ణ, సీనియర్ నాయకులు కట్ట తిరుపతి గౌడ్ తదితరులు ఉన్నారు.

# అందుబాటులో ఉండి సేవలందించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్
- టేక్మాల్ మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

**వేద న్యూస్, టేక్మాల్:**



వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. టేక్మాల్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ, ఫార్మసీ, ల్యాబ్, టాయిలెట్స్, పరిశీలించి, వైద్యులు, అధికారులకు పలు సూచనలు చే శారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని, దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరికీ అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నూతన వార్డు సభ్యులకు సన్మానం

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామంలో వెంకటాపూర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గౌరవ ఓరియంట్ ఆదాని సిమెంట్ యూనియన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్ రావు, వేముల కృష్ణ, ఆడే శంకర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వార్డు సభ్యులకు పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనక రాజు, ఎంబడి కిషన్, ఆడే జంగు, జాడి శంకర్, ఉప సర్పంచ్ కొడప అనంత్ రావు, మెస్రం జూగ్గు, కుర్సెంగా బుదేశ, కొడప గంగు, ఎదుల పోషమల్లు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డొస్తే.. అంతమే!

- వివాహేతర సంబంధాల మోజులో హత్యలు
- భర్తలను అతి కిరాతకంగా చంపేస్తున్న కొంతమంది భార్యలు



- ☐ తాజాగా ఉత్తర ప్రదేశ్ శంబల్లో సంచలన ఘటన
- ☐ భర్తను ముక్కలు చేసి.. గ్రైండర్లో వేసి రుబ్బి..
- ☐ రుణమాఫీ కోసం ప్రియుడితో కలిసి భర్త మర్డర్
- ☐ మహబూబాబాద్లో వెలుగు చూసిన మరో ఘటన
- ☐ పాశ్చత్య మోజు.. సోషల్ మీడియా ప్రభావం
- ☐ అర్థంలేని పనులతో కుటుంబాలు బలి
- ☐ అడ్డొస్తున్నారని పిల్లలనూ హతమారుస్తున్న పైశాచికం
- ☐ ఎంత ప్లాన్ చేసినా టెక్నాలజీతో అడ్డంగా దొరికేస్తున్న కిరాతకులు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

ఒకప్పుడు జీవితం అనే ప్రయాణానికి దిశానిర్దేశం చేసిన వివాహ బంధం.. ఇప్పుడు అనేక చోట్ల రక్తంతో మసకబారుతోంది. ప్రేమ, విశ్వాసం, బాధ్యతలతో నడవాల్సిన కుటుంబ జీవితం, వివాహేతర సంబంధాల మోజులో అతి క్రూరమైన హత్యలుగా మారిపోతోంది. భర్తలను భార్యలు తమ ప్రియులతో కలిసి చంపేస్తున్న ఘటనలు, ఆ బంధానికి అడ్డుగా ఉన్నారన్న కారణంతో అభం శుభం తెలియని పిల్లల్నే బలి తీసుకుంటున్న దారుణాలు, తల్లిదండ్రులను సైతం కడతేర్చిన కేసులు ఎన్నో వెలుగు చూస్తున్నాయి.

దేశం వాప్తంగా ఇటీవల ఇలాంటి ఘటనలు ఎన్నో సంచలనంగా మారగా.. ఇటీవల అలాంటి క్రూరమైన ఘటనే వెలుగు చూసింది. ఉత్తర ప్రదేశ్ శంబల్ జిల్లాలో ఓ కిరాతక హత్యోదంతం ఇప్పుడు వివాహ వ్యవస్థపైనే నమ్మకం కోల్పోయేలా చేస్తోంది. అంతే కాకుండా.. తాజాగా హౌస్ లోన్ మాఫీ కావాలన్న దురాశతో ప్రియుడితో కలిసి భర్తను పక్కా స్కెచ్ వేసి హతమార్చిన భార్య వ్యవహారం మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. భర్తను ప్రియుడితో కలిసి చంపి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసినా చివరికి దొరికి పోయింది. మహబూబ్నగర్ జిల్లాలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తన ప్రియుడి సహకారంతో భర్తను చంపి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించింది.. ఇవి వ్యక్తిగత నేరాలకే కాదు, సమాజం ఎదుర్కొంటున్న నైతిక సంక్షోభానికి ప్రతిబింబంగా మారాయి. వివాహేతర సంబంధం ఒక దశలో సీక్రెట్ పరిచయంగా మొదలై.., తరువాత భయాలు, అనుమానాలు వంటి అంశాలతో ముడిపడి నేరంగా పరిణమిస్తోంది. సంబంధాన్ని బహిర్గతం చేస్తారన్న భయం, విడాకుల ప్రక్రియలో ఎదురయ్యే సామాజిక ఒత్తిళ్లు, ఆర్థిక నష్టాల ఆందోళన.. ఇవన్నీ కలిసి చివరికి అడ్డంకిని తొలగిస్తే సమస్య ముగుస్తుంది.. అన్న ప్రమాదకర ఆలోచనను పెంచుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఆలోచనలే హత్యలకు దారి తీస్తున్నాయి.

**- ముక్కలుగా చేసి.. గ్రైండర్లో వేసి రుబ్బి**

ఉత్తర ప్రదేశ్ శంబల్ జిల్లాలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న నెపంతో రాహుల్ అనే వ్యక్తిని అతని భార్య రూబీ తన ప్రియుడు గౌరవ్ తో కలిసి నవంబర్ 18న అత్యంత పాశవికంగా హతమార్చింది. అంతేకాదు మృతదేహాన్ని ముక్కలుగా చేసి గ్రైండర్లో వేసి రుబ్బి కాల్వలో పారేసింది. చివరికి భర్త చేతిపై ఉన్న టాటూ రూపంలో దొరికి పోయింది. కానీ ఇప్పుడున్న ఆధునిక దర్యాప్తు పద్ధతులు, టెక్నాలజీ వల్ల నిందితులు తప్పించుకోలేకపోయారు. కానీ ఇప్పుడు ఇలాంటి ఘటనలు.. మనం గొప్పగా చెప్పుకునే పవిత్ర బంధం ఎంత సేఫ్ ప్రశ్నిస్తున్నాయి?

**- అతి క్రూరత్వం..**

ఇటీవలి నమోదైన కేసుల్లో కనిపిస్తున్న అత్యంత కలచివేసే అంశం అతి కిరాతకత. ఎందుకంటే ఇలాంటి ఘటనల్లో జరిగిన హత్యల్లో అత్యంత క్రూరమైన మనస్తత్వం బయట పడుతోంది. హత్య చేసిన తర్వాత దేహాన్ని ముక్కలుగా చేయడం, డ్రమ్లలో దాచడం, కాల్చడం, గ్రైండర్లలో వేసి రుబ్బడం.. ప్రమాదంగా చిత్రీకరించడం.. ఇవి నేరం దాచుకునే ప్రయత్నాలుగా మొదలైనా, చివరికి నేరస్తుల మానసిక స్థితిని వెల్లడిస్తున్నాయి. ఇలాంటి ప్లాన్ చేస్తే తప్పించుకోవచ్చు.. అన్న భ్రమే, ఫోరెన్సిక్ సైన్స్, డిజిటల్ ఆధారాల ముందు కూలిపోతోంది. ఇంకా అత్యంత భయంకరమైన వాస్తవం ఏమిటంటే.. వివాహేతర సంబంధాలకు అడ్డొస్తున్నారని పిల్లల్ని కూడా చంపిన ఘటనలు కూడా చాలానే బయటపడ్డాయి. తల్లిదండ్రుల మధ్య ఘర్షణకు మూల్యం చెల్లించేది చిన్నారులే అవుతుండటం, కుటుంబం అనే వ్యవస్థ ఎంత లోతుగా కూలిపోతోందో అర్థమవుతోంది. ఒక నేరం కేవలం ఒక జీవితాన్ని కాదు.. భవిష్యత్తు తరాల మనస్తత్వాన్ని, సమాజపు విశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తుంది.

**- సోషల్ మీడియా ప్రభావం..**

నిపుణుల విశ్లేషణలో మరో కీలక అంశం ఏంటంటే.. ఇలాంటి నేరాల్లో సోషల్ మీడియా ప్రభావం చాలా ఉంటోందని. చాట్స్, రీల్స్, సీక్రెట్ సంభాషణలు పరిచయాలను వేగంగా దగ్గర చేస్తున్నాయి. అదే వేగంతో అవి అప్రమత్తతను తగ్గించి, నియంత్రణలేని భావోద్వేగాలను పెంచుతున్నాయి. డిజిటల్ ప్రైవసీ అన్న భావన, నిజ జీవిత బాధ్యతల నుంచి తప్పించుకునే సాధనగా మారుతుండటం ప్రమాదకరంగా మారింది.

**- పాశ్చాత్య మోజు..**

వివాహం, కుటుంబం పట్ల ఉన్న స్థానిక విలువలు క్రమంగా మసకబారుతుండగా, పాశ్చాత్య జీవనశైలిపై మోజు పెరుగుతోందని సామాజికవేత్తలు అంటున్నారు. వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో బాధ్యతల నుంచి పారిపోవడం, సమస్యలకు చట్టబద్ధమైన పరిష్కారాల్ని వదిలి తక్షణ అనైతిక పరిష్కారాల్ని ఎంచుకోవడమే ఇలాంటి దారుణాల వైపు అడుగులు వేయిస్తున్నాయి. అంతేకాదు పవిత్ర వివాహబంధాల్ని, కుటుంబ వ్యవస్థను పక్కన పెట్టి అడ్డదారులు తొక్కడం.. ఇలాంటి ఘటనలకు కారణం అవుతున్నాయి.

**- ఎంత ప్లాన్ చేసినా..**

అయితే ఇలాంటి ఘటనల్లో నేరస్తులు ఎంతటి ప్లాన్ చేసినా ఇప్పుడున్న టెక్నాలజీ ముందు దొరికిపోవడం ఖాయమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. నేరం ఎంత ప్లాన్ చేసినా, డిజిటల్ ఫుట్ప్రింట్ తప్పదు. కాల్ డేటా, లొకేషన్ ట్రాకింగ్, సీసీటీవీ, ఫోరెన్సిక్.. ఆధునిక దర్యాప్తు పద్ధతులు ఇవన్నీ నిజాన్ని బయటపెడుతున్నాయి. అయినా నేరాలు ఆగకపోవడం, నివారణపై దృష్టి అవసరమన్న సంకేతాలు కనపడుతున్నాయి.

**- ఇటీవల దేశాన్ని కుదిపేసిన కేసులు**

**మీరట్ 'డ్రమ్ మర్డర్'**

ఉత్తరప్రదేశ్లోని మీరట్లో.. భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా చేసి డ్రమ్లో దాచిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. తొలుత అదృశ్య కేసుగా నమోదైన ఈ ఘటన, దుర్వాసనతో వెలుగులోకి వచ్చింది. ఫోరెన్సిక్ ఆధారాలు, కాల్ డేటా కేసును ఛేదించాయి.

**- బీహార్ లవ్ అఫైర్ మర్డర్**

గ్రామీణ నేపథ్యంలోని ఈ కేసులో భార్య,ప్రియుడు కలిసి భర్తను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. ప్రమాద మరణంగా చూపించే ప్రయత్నం చేసినా పోస్ట్మార్టం రిపోర్ట్తో అది బయటపడి చివరికి గ్రామంలో ఉద్రిక్తతలు చెలరేగాయి.

**- ఇండోర్ విషమర్డర్**

మధ్యప్రదేశ్లోని ఇండోర్లో ఆహారంలో విషం కలిపి భర్తను హత్య చేయడంలో భార్య ఆమె ప్రియుడు పాత్ర ఉందని పోలీసులు వెల్లడించారు. సహజ మరణంగా చిత్రీకరించాలన్న యత్నం విఫలమైంది. ఫోరెన్సిక్ పరీక్షలు, వాట్సాప్ చాట్స్ కీలక ఆధారాలయ్యాయి.

**- జైపూర్ ప్లాన్డ్ మర్డర్**

రాజస్థాన్లోని జైపూర్లో పక్కా ప్లాన్ ప్రకారం భర్తను ఒంటరిగా పిలిచి హత్య చేసి, ప్రమాదంగా చూపించేందుకు ప్రయత్నించారు. సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ లొకేషన్ డేటా కేసును బట్టబయలు చేశాయి.

**- నాసిక్ ఫామ్హౌస్ హత్య**


మహారాష్ట్ర నాసిక్ లో ఫామ్హౌస్కు తీసుకెళ్లి ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆస్తి వివాదం, వివాహేతర సంబంధమే ప్రేరణగా పోలీసులు పేర్కొన్నారు.

# ఎగవేతల సీఎం

మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామని ప్రకటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం పేరు ఎనుముల రేవంత్ రెడ్డి కాదని, 'ఎగవేతల రేవంత్ రెడ్డి' అని వ్యాఖ్యానిస్తూ ఆయనపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పెద్ద పెద్ద గొంతులతో మాట్లాడడం కాదు, మంచి పనులతో ప్రజల ముందుకు రావాలని సూచించారు. పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని, ఇప్పటికీ నెలనెలా న్యూఢిల్లీకి సంచులు పంపుతున్నారని ఆరోపించారు. రోజూ తిట్ల పురాణం తప్ప పరిపాలనలో కొత్తదేమీ లేదని విమర్శించారు. సీఎం వ్యవహార శైలిపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, ఆయన వాడే భాష ఏంటని ప్రశ్నించారు. హైదరాబాద్ గల్లీల్లో తిరిగిన తాను కూడా తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషులో తిట్టగలనని వ్యాఖ్యానిస్తూ, ఆ స్థాయికి తాను దిగజారబోనని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డిని జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన భార్య గీతమ్మకు సూచించారు. ఏనుగు లాంటి కేసీఆర్ ను తిడుతూ, చావు కోరుకుంటున్నారని ఆరోపించారు. జనవరి ఒకటి నుంచి కోటి మంది మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని శపథం చేయాలని రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తులం బంగారం ఇస్తామని ఒట్టు పెట్టి అమలు చేయాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్కు అండగా నిలుస్తున్న హైదరాబాద్ ప్రజలకు పాదాభివందనం చేసినా తప్పు లేదని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల నుంచే నిజమైన మార్పు ప్రారంభమైందని ఆనందం వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి కుమారుడు భూములు కబ్జా చేస్తుంటే కేసు పెట్టిన పోలీసు అధికారిని లూప్ లైన్లో పెట్టారని ఆరోపించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పేరు గాంధీ అయినా, చేసేవి మాత్రం గాడ్సే పనులని, భూకబ్జాలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్లో చేరి బీఆర్ఎస్లోనే ఉన్నామని చెప్పుకునే రాజకీయాలు నడుస్తున్నాయని, స్పీకర్ కళ్లు ఉండి చూడలేని ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు భయపడి పది మంది ఎమ్మెల్యేలు దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ఒక్క మీటింగ్, ఒక్క ప్రెస్మీట్ పెట్టగానే కాంగ్రెస్ నేతలకు ముచ్చెమటలు పట్టాయని, చలిజ్వరం వచ్చిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగిపోతుందన్నారు. తన తండ్రిని తిడుతున్నందుకు తనకు తీవ్ర కోపముందని కేటీఆర్ స్పష్టం చేశారు. తాను గుంటూరులో చదివితే తప్పేమిటని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డిలా చదువు లేకుండా తిరగలేదన్నారు. తాను ఆంధ్రాలో చదివితే తప్పు అంటారని, కానీ సీఎం మాత్రం ఆంధ్రా అల్లుడిని తెచ్చుకున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఢిల్లీకి సంచులు మోసుకుంటూ గులాంలా బతకబోమని, తెలంగాణ పౌరుషంతో బతుకుతామని స్పష్టం చేశారు. కేసీఆర్ను మళ్లీ ముఖ్యమంత్రి కానివ్వబోమని రేవంత్ రెడ్డి అంటున్నారని, దమ్ముంటే కొడంగల్లో గెలవకుండా చేద్దామంటూ పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. 2026లో కష్టపడితే 2027లో ఎన్నికల వాతావరణం వస్తుందని, అప్పటివరకు కేసీఆర్ను మళ్లీ సీఎం చేసుకునే వరకు పోరాడదామని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లికి వచ్చి ఉప ఎన్నికల్లో తేల్చుకుందామని ఎమ్మెల్యే గాంధీకి సవాల్ విసిరారు. ఈ ప్రభుత్వం చేస్తున్నది కూల్చివేతలు, పేల్చివేతలు, ఎగవేతలు మాత్రమేనని కేటీఆర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు.

# న్యూ ఇయర్ జోష్ హద్దు మీరొద్దు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా కట్టడి చేయడమే లక్ష్యంగా 'జీరో డ్రగ్స్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ స్పష్టం చేశారు. ఈ మేరకు నగర పోలీసు యంత్రాంగం కఠిన చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్లోని తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్లో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో హెచ్-న్యూ, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, వెస్ట్ జోన్, సీసీఎస్ తదితర విభాగాల అధికారులతో సీపీ సజ్జనర్ విస్తృతంగా చర్చించారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో డ్రగ్స్ వినియోగాన్ని ఏమాత్రం ఉపేక్షించబోమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. శుక్రవారం నుంచే నగరంలోని పబ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఈవెంట్లు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా బృందాలను మోహరించినట్లు తెలిపారు. ప్రధాన వేదికలతో పాటు సర్వీస్ అపార్ట్మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీలపైనా నిఘా కొనసాగుతుందని చెప్పారు. గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కదలికలను నిశితంగా గమనిస్తున్నామని, డ్రగ్స్ సరఫరాదారులు, వినియోగదారుల జాబితా సిద్ధం చేసి నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. నగరానికి కొత్తగా వచ్చేవారి వివరాలనూ సేకరిస్తున్నామని పేర్కొన్నారు. వేడుకల సమయపాలనపై కూడా సీపీ సజ్జనర్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పబ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు తప్పనిసరిగా రాత్రి ఒక గంటకే మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పబ్లు, హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వాటి లైసెన్సులను రద్దు చేస్తామని తేల్చిచెప్పారు. మైత్రీవనం, నెక్లెస్ రోడ్, ట్యాంక్బండ్, కేబీఆర్ పార్క్ వంటి జనసమర్థ ప్రాంతాలతో పాటు రద్దీగా ఉండే అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన చెక్పోస్టులు, బ్యారికేడింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిఘా పేరుతో సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. నగర పోలీసులంతా సమన్వయంతో పని చేసి పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని సీపీ సజ్జనర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీపీలు ఎన్.శ్వేత, కె.అపూర్వ రావు, రక్షిత కృష్ణమూర్తి, సిహెచ్. రూపేష్, చింతమనేని శ్రీనివాస్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్తో పాటు టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీలు అందే శ్రీనివాస రావు, ఇక్బాల్ సిద్దిఖీ తదితర అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం డిసెంబర్ 27, 2025

# కమ్యూనిస్టులు లేని పోరాటాలు లేవు

**- కామ్రేడ్ దాగం మల్లేష్**



**వేద న్యూస్, కాసిపేట:**

సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101వ వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కాసిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్ జెండా ఆవిష్కరించి పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు కార్మికులు, కర్షకులు, విద్యార్థుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర పార్టీదని తెలిపారు. చట్టసభల్లో కార్మిక, కర్షక వర్గాలకు అనేక అనుకూల చట్టాలు తీసుకువచ్చిన పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ అనేక మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సీపీఐ పార్టీ కీలక పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వామ్యమైందన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, ప్రజల పక్షాన, కార్మికులు-కర్షకుల పక్షాన నిరంతరం పోరాడుతున్న పార్టీ సీపీఐ అని అన్నారు. జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న శతయంతి ముగింపు ఉత్సవాల భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జాడి పోచం, దాడి గట్టయ్య, శాఖ కార్యదర్శులు దుర్గం సుధాకర్, పులి శంకర్, గంగాధరి రాజయ్య, దాగం రాజలింగు, రత్నం భీమన్న, గోనె సత్యం, గోదారుల లింగమూర్తి, దుర్గం పోశం, సోమగూడెంలో జెండా ఆవిష్కరించిన సీనియర్ కామ్రేడ్ జూపాక కొమురయ్య, ఎస్. నాగేశ్వరరావు, సందీప్ కుమార్, ఈ. సుందరం, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

**- ఎమ్మెల్యే వర్ధన్నపేట ఎమ్మెల్యేకు వినతి**

**వేద న్యూస్, కాజీపేట:**



తెలంగాణ రాష్ట్రంలో దేవాదాయ శాఖ పరిధిలో దేవాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న అర్చకులను, తదితర సిబ్బంది అందరినీ దేవాదాయ శాఖలో రెగ్యులరైజ్ చేయాలని శుక్ర వారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ఎమ్మెల్యే కార్యాలయంలో ఉద్యోగులంతా కలిసి వినతి పత్రం అందజేశారు. 2017 సెప్టెంబర్ 15వ తేదీ నాటి వరకు పనిచేస్తున్న అర్చక సిబ్బంది అందరి సర్వీసులను రెగ్యులర్ చేయడానికి గత ప్రభుత్వం జీవో నెంబర్ 577 ను జారీ చేయగా, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 121 ప్రకారం కట్ ఆఫ్ డేట్ నిర్ణయిస్తూ 2014 జూన్ 2వ తేదీ వరకు ఉన్న సిబ్బందికి మాత్రమే రెగ్యులర్ చేశారన్నారు. ఈ విషయంలో కట్ ఆఫ్ డేట్ తర్వాత నియామకం కాబడిన కాంట్రాక్ట్, కన్సాలిడేటెడ్, రోజువారీ, ఔట్ సోర్సింగ్ మొదలగు పద్ధతుల ద్వారా వివిధ దేవస్థానములలో చాలా మంది చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న అర్చక సిబ్బంది అందరికీ జీవో నెంబర్ 577 ప్రకారం రెగ్యులర్ చేసి, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు మంజూరు చేయించగలరని కోరారు. ఎమ్మెల్యే నాగరాజు ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దేవాలయాలలో పనిచేస్తున్న సిబ్బంది ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో మడికొండ మెట్టుగుట్ట శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతా రామచంద్ర స్వామి, శ్రీ ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డిలైట్ క్లౌడ్ కిచెన్ ను ప్రారంభించిన రావు పద్మ

**వేదా న్యూస్, హనుమకొండ:**




హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ రెండో గేటు పరిధిలో విజయ గణపతి నగర్ రోడ్ నెంబర్ 4ఏలో అంతర్జాతీయ చిరంజీవి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడికి చెందిన డెలిషియస్ డిలైట్స్ క్లౌడ్ కిచెన్ ను బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ.. త్రినగరి లోని ప్రజలు క్లౌడ్ కిచెన్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. యువతకు కావాల్సిన అన్ని రకాల ఇండో చైనీస్ ఐటమ్స్, బిర్యానీ, అన్ని రకాల స్టార్టర్స్ అందుబాటులో అతి తక్కువ ధరలకు లభిస్తుందని పేర్కొన్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా డిస్కౌంట్ ఆఫర్తో పైన పేర్కొన్న అన్ని రకాల ఐటమ్స్ ఆన్లైన్లో డెలివరీ చేయబడునని త్రిశూల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిలీషియస్ డిలైట్స్ ప్రొప్రేటర్ గుత్తికొండ త్రిశూల్, తారక రామ్ రెడ్డి , ఆదిత్య, నిశాంత్, వంట మాస్టర్ దిలీప్ పాల్గొన్నారు.

# ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, దామరచర్ల:**

సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను దామచర్ల మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కనకయ్య మాట్లాడుతూ... భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. 1925లో కాన్పూర్ నగరంలో ఎంఎం రాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిందని తెలిపారు. ఆనాడు బ్రిటిష్ వారి నుంచి మన దేశ విముక్తి కోసం రాజీలేని పోరాటాలు చేసిందని చెప్పారు. గడచిన శతాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు, ఎన్నెన్నో త్యాగాలు ఎంతోమంది అమరవీరుల రక్త తర్పణతో ఎన్నో విజయాలు సాధించి భారత దేశ రాజకీయ చరిత్రలో సీపీఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుందని గుర్తు చేశారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్నటువంటి సీపీఐ పక్షాన కార్మికులు, కర్షకులు రైతులు మహిళలు విద్యార్థులు ప్రతి ఒక్కరు పార్టీ పక్షాన ఉండాలని ప్రజా పోరాటాల్లో భాగ స్వామ్యులు కావాలని అన్నారు. అలాగే శత జయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మం జిల్లా లో జరగబోయే బహి రంగ సభను విజయ వంతం చేసేందుకు ప్రతి ఒక్కరు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, గిజజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగ నాయక్, సీపీఐ సహాయ కార్యదర్శి ధనావత్ శాంత, సీనియర్ నేతలు జమ్ముల కోటయ్య, భాగం శేషయ్య, గజ్జల లక్ష్మీ నరసింహ రెడ్డి, పేరుపొంగు లక్ష్మయ్య, పేరుపొంగు సైదులు, దర్శనం వినయ్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.



# ఢిల్లీకి బయల్దేరిన సీఎం రేవంత్‌రెడ్డి

**- సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్ వేద న్యూస్:**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు బయల్దేరారు. రేపు జరగనున్న కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయ మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు.ఈ సమావేశంలో దేశ వ్యాప్తంగా రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యూహాలు, రానున్న ఎన్నికల ప్రణాళికల పై చర్చ జరిగే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణకు సంబంధించిన అంశాలను కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఈ భేటీలో ప్రస్తావించనున్నట్లు సమాచారం.

# పురాణ పురుషుల గొప్పతనాన్ని పిల్లలకు చెప్పాలి

**వేద న్యూస్, తిరుపతి ప్రతినిధి:**

స్పైడర్ మ్యాన్, ఐరన్ మ్యాన్ వంటి కాల్పనిక పాత్రలకన్నా హనుమంతుడు, అర్జునుడు వంటి మన పురాణ పురుషులే గొప్పవారని పిల్లలకు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అవతార్ సినిమా కంటే మన రామాయణం, మహాభారతం ఎంతో గొప్పవని పిల్లలకు వివరించాలని పిలుపునిచ్చారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. వేల ఏళ్ల క్రితమే హరప్పా నాగరికత ద్వారా అర్బన్ ప్లానింగ్‌ను ప్రపంచానికి పరిచయం చేశామని, యోగా ఆయుర్వేదం వంటి శాస్త్రాలను మానవాళికి అందించామని చంద్రబాబు గుర్తుచేశారు. తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలు, సున్నాచదరంగం వంటి ఆవిష్కరణలు భారత జ్ఞాన సంపదకు నిదర్శనమని చెప్పారు. ఆర్యభట్ట, భాస్కరాచార్య, కౌటిల్యుడు వంటి మహానుభావులు దేశానికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. రెండు వేల ఏళ్ల క్రితమే ప్రపంచ జీడీపీలో భారత్‌కు 40 శాతం వాటా ఉండేదని, విదేశీ పాలనతో పాటు కొన్ని విధానాల కారణంగా వెనుకబడ్డామని విశ్లేషించారు. దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆరెస్సెస్ చేస్తున్న కృషిని కొనియాడుతూ, మోహన్ భగవత్ పాత్ర శ్లాఘనీయమన్నారు. దేశాభివృద్ధికి పునాదులు వేసిన అటల్ బిహారీ వాజ్‌పేయి వారసత్వాన్ని కొనసాగిస్తూ నరేంద్ర మోదీ దేశాన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. తిరుగులేని యువశక్తి మన దేశానికి బలం అని, కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్ర అభివృద్ధిపై మాట్లాడుతూ... ఏపీలో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, త్వరలో రాష్ట్రం నుంచి క్వాంటం కంప్యూటర్‌ను ఆపరేట్ చేయనున్నట్లు తెలిపారు. విశాఖలో గూగుల్ వంటి సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. సదస్సు ప్రారంభానికి ముందు చంద్రబాబు, మోహన్ భగవత్‌తో కలిసి స్టాళ్లను సందర్శించి స్వదేశీ పరిజ్ఞానంతో



రూపొందిన పరికరాలను తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించగా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, మంత్రి అనగాని సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

# రైల్వే ప్రయాణికులకు షాక్..

**- నేటి నుంచే పెరిగిన రైలు ఛార్జీలు అమలు**

**- 2026 మార్చి 31 నాటికి రైల్వేకు రూ.600 కోట్లు అదనపు ఆదాయం**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




దేశవ్యాప్తంగా రైల్వే ప్రయాణికులకు అదనపు భారం పడనుంది. నేటి నుంచి సవరించిన రైలు ఛార్జీలు అమల్లోకి వచ్చాయి. ఈ ఛార్జీల పెంపుతో 2026 మార్చి 31 నాటికి సుమారు రూ.600 కోట్లు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలనే లక్ష్యంతో రైల్వే శాఖ ముందుకు సాగుతోంది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులు పెరిగిన టికెట్ ధరలకు సిద్ధం కావాల్సి వస్తోంది. జనరల్ టికెట్ల విషయంలో 215 కిలోమీటర్లకు మించి ప్రయాణించే వారికి కిలోమీటరుకు 1 పైసా అదనపు ఛార్జీ విధిస్తున్నారు. 216 నుంచి 750 కిలోమీటర్ల మధ్య దూరానికి రూ.5 పెంపు, 751 నుంచి 1250 కిలోమీటర్లకు రూ.10, 1251 నుంచి 1750 కిలోమీటర్లకు రూ.15, 1751 నుంచి 2250 కిలోమీటర్ల మధ్య దూరానికి రూ.20 అదనంగా వసూలు చేయనున్నారు. అయితే 215 కిలోమీటర్లలోపు ప్రయాణాలకు ఎలాంటి పెంపు ఉండదని రైల్వే అధికారులు తెలిపారు. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్-ఏసీ, ఏసీ తరగతులకు కిలోమీటరుకు 2 పైసల చొప్పున ఛార్జీలు పెరుగుతాయి. దీని ప్రకారం 500 కిలోమీటర్ల నాన్-ఏసీ ప్రయాణానికి అదనంగా రూ.10 ఖర్చవుతుంది. అయితే పేద, మధ్యతరగతి ప్రయాణికులకు ఊరటగా సీజనల్ సబర్బన్, నెలవారీ పాస్ టికెట్లపై ఈ ఛార్జీల పెంపు వర్తించదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. గత పదేళ్లలో రైల్వే నెట్‌వర్క్ విస్తరణ, మారుమూల ప్రాంతాలకు సేవలు పెరగడం, మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఈ ఛార్జీల సవరణ అవసరమైందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది రైలు ఛార్జీలు పెరగడం ఇది రెండోసారి కాగా, జూలైలో ఇప్పటికే ఒకసారి పెంపు అమలైంది. సవరించిన ధరలు తేజస్ రాజధాని, రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్, హమ్‌సఫర్, అమృత్ భారత్, తేజస్, మహామాన, గతిమాన్, అంత్యోదయ, గరీబ్ రథ్, జన శతాబ్ది, యువ ఎక్స్‌ప్రెస్, నమో భారత్ ర్యాపిడ్ రైల్ వంటి ప్రధాన రైళ్లకు వర్తిస్తాయని రైల్వే శాఖ తెలిపింది. డిసెంబర్ 26న లేదా ఆ తర్వాత బుక్ చేసిన టికెట్లకే ఈ కొత్త ఛార్జీలు వర్తిస్తాయని, ఇప్పటికే బుక్ చేసిన టికెట్లపై ఎలాంటి అదనపు భారముండదని అధికారులు స్పష్టం చేశారు.

# తెలంగాణ హ్యాండ్లూమ్ కు కొత్త ఊపిరి

**- సింగిడి కలెక్టివ్‌ను ప్రారంభించిన కటీఆర్**

**- సహజ రంగులు సుస్థిర ఫ్యాషన్‌కు పెద్ద పీట**

**- నెయ్యి పత్తి, నేసకుల గౌరవమే కేంద్రబిందువు**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




తెలంగాణ హ్యాండ్లూమ్ వారసత్వాన్ని పునరుజ్జీవింపజేసి, పర్యావరణ హితమైన ఫ్యాషన్‌ను ప్రోత్సహించే దిశగా కీలక ముందడుగు పడింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'సింగిడి కలెక్టివ్' అనే సుస్థిర ఫ్యాషన్ బ్రాండ్‌ను ప్రారంభించారు. స్వదేశీ నైపుణ్యం, సహజ రంగుల సంప్రదాయాలను పరిరక్షించడమే లక్ష్యంగా ఈ బ్రాండ్ ముందుకు సాగనుంది.ఈ ప్రారంభోత్సవంలో బ్రాండ్ దృక్పథం, రూపకల్పనలో మేధో క్రమశిక్షణ, నేసకుల జీవనోపాధికి భరోసా వంటి అంశాలను వివరించారు. వర్షాధార నెయ్యి, పత్తి సహజత్వాన్ని ఆధునిక, బాధ్యతాయుత వినియోగదారుల అభిరుచులతో మేళవిస్తూ సింగిడి కలెక్టివ్ ప్రత్యేకతను చాటుతోంది. తెలంగాణ నెయ్యి సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడమే దీని లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇక్కత్ నుంచి గొల్లబామ వరకు తెలంగాణ వస్త్ర రంగం ఎప్పుడూ ఆవిష్కరణల పుట్టినిల్లు అని, సహజ రంగుల జ్ఞానం-ఆధునిక డిజైన్ సమ్మేళనమే సింగిడి.. ఆర్థికంగా సాధ్యసాధ్యాలకే పరిమితం కాకుండా నైతిక విలువలతో బ్రాండ్లను నిర్మిస్తున్న యువతను చూడటం ఆనందంగా ఉందన్నారు. ఇది ఫ్యాషన్ మాత్రమే కాదు.. నెయ్యి నేసకుల గౌరవం, సుస్థిరతపై ప్రకటన అని పేర్కొన్నారు. తెలంగాణ భాషలో 'వర్ణధనుస్సు' అనే అర్థం వచ్చే 'సింగిడి' పేరుకు తగ్గట్టే, మొక్కలు, వేర్లు, పుష్పాల నుంచి పొందిన సహజ రంగుల విస్తృత శ్రేణిని ఈ బ్రాండ్ వినియోగిస్తోంది. విషపూరిత రసాయనాలకు పూర్తిగా దూరంగా ఉండి, నేలనేసకుల కథను ప్రతి వస్త్రం చెప్పేలా రూపకల్పన చేస్తోంది. సింగిడి కలెక్టివ్ స్థాపకుడు విశ్వ శారధి మాట్లాడుతూ.. భూమిని గౌరవించే, నేసకుల శ్రమకు న్యాయం చేసే పద్ధతులకే తిరిగిరావాలనే ఒకే లక్ష్యంతో సింగిడిని ప్రారంభించామన్నారు. మరిచిపోయిన సహజ రంగుల విధానాలు, దేశీయ నెయ్యి పద్ధతులపై లోతైన పరిశోధన చేసి ఈ కలెక్షన్లు రూపొందించామని తెలిపారు. హ్యాండ్లూమ్ రంగానికి నిరంతర మద్దతు ఇస్తున్న కేటీఆర్‌కు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. లింగ భేదం లేని ఆధునిక ఆకృతులు, చేతితో నేసిన వస్త్రాలు, పారదర్శకత, మూలం, కథనం విలువలుగా సింగిడి కలెక్షన్ రూపుదిద్దుకుంది. హ్యాండ్లూమ్ నైపుణ్యాన్ని ప్రపంచపటంపై నిలిపే లక్ష్యంతో హైదరాబాద్ కేంద్రంగా సింగిడి కలెక్టివ్ ముందుకు సాగనుంది.

వేద న్యూస్



# గెలిచిన వారిని ఆదర్శంగా తీసుకోవాలి



- మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య
- నూతన సర్పంచ్ కు సన్మానం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో విజయ బావుట ఎగుర వేసి ఇల్లంతకుంట సర్పంచ్ పీఠం అధిష్టించిన మామిడి రాజును, తాళ్లపెల్లి ఉప సర్పంచ్ ఎలుక రామ స్వామి, రేపాక ఉప సర్పంచ్ కోదాని మహేష్, ముస్కాన్ పేట్ ఉప సర్పంచ్ దాసరి లావణ్య శ్రీనివాస్ ను మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, మండల మాల మహానాడు నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద వారిని శాలువాళతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో మాల సామాజిక వర్గం ముద్దు బిడ్డలు తమ సత్తా చాటి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై మాల సామాజిక వర్గానికి గర్వకారణంగా నిలిచారన్నారు. అంతే కాకుండా నేటి రాజకీయాల్లో మన పతాక ఎగురవేసి నేడు గెలిచిన మామిడి రాజు ఇతర ప్రజా ప్రతినిధులను ఆదర్శంగా తీసుకొని మన ఉనికి చాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు రాష్ట్ర నాయకులు దామెర సత్యం, జిల్లా అధ్యక్షులు నీరటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గూడ బాబు, నీరటి కిరణ్ కుమార్, దామెర నర్సయ్య, సొల్లు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

**వేద న్యూస్, బెల్లంపల్లి :**



బెల్లంపల్లి మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంసి క్రికెట్ మైదానంలో శుక్రవారం ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంటును బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు పెడ మార్గంలో పయనించకుండా ఉండడానికి ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు అవసరమన్నారు. క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని సాధించి పేరు సంపాదించాలన్నారు. ఈ లీగ్ టోర్నమెంట్ ను మూడు విభాగాలుగా ఏబిసి పేరుతో విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య, సీనియర్ క్రికెటర్ ఈగ వెంకటస్వామి అకాడమీ ఇన్చార్జ్ అల్లం వెంకటేశ్వర్లు కోచ్ జాడి శేఖర్, సీనియర్ క్రికెటర్లు బూదే సత్తి, గీస రాములు, జి శ్రీనివాస్ చారి, అల్లం గౌతం పిఏటి హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు తప్పని తిప్పలు..

- బద్ది పోచమ్మ ఆలయం వద్ద ఇబ్బందులూ రోడ్డపై గుంతలో నిలిచిన నీరు

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడలోని బద్దిపోచమ్మ గుడి వద్ద భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ భీమన్నను దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనం చెల్లించు కోవడం ఆనవాయితీ. గుడి ముందు కొబ్బరికాయలు కొట్టే చోట రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి గుంతలో నీరు నిలచి భక్తులకు ఇబ్బందిగా మారింది. భక్తి శ్రద్ధలతో బోనం సమర్పించి కొబ్బరి కాయ కొట్టి మొక్కులు చెల్లించుకునే సమయంలో భక్తులకు అసంతృప్తి వ్యక్తమవుతోంది. అటువైపు వెళ్లే వాహనదారులు గుంతతో నానా తిప్పలు పడుతున్నారు. కొన్ని సమయాల్లో స్వల్ప ప్రమాదాలు జరుగుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా సెలవులు రావడం, సమ్మక్క, సారలమ్మ జాతర సమీపిస్తుండటంతో భక్తుల తాకిడి ఎక్కువవుతోంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశం కావున గుంతతో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం పొంచి ఉందని, సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగక ముందే గుంతను మరమ్మతులు చేసి భక్తులు ప్రశాంతంగా మొక్కులు చెల్లించుకునేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

# కేసీఆర్ బిక్షతోనే సీఎం అయ్యావు

- నీ చిల్లర మాటలతో ప్రజలు చీదరించుకుంటుండ్రు
- నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోం
- ప్రజలకు నువ్విచ్చిన హామీలు నెరవేర్చు
- 2029లో నీ ప్రభుత్వాన్ని బొంద పెడతాం
- మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్
- సీఎం రేవంత్ రెడ్డి పై ఫైర్



**వేద న్యూస్, కరీంనగర్:**

ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచుల సన్మానసభలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జాతిపిత, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, 14 ఏళ్లు సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సాధన కోసం సకల జనులను ఏకం చేసి చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి కేసీఆర్ పదేళ్లపాటు సుపరిపాలనను అందించారన్నారు. దేశంలోనే ఒక రోల్ మోడల్ గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన తెలంగాణ బాపు కేసీఆర్ ను పట్టుకొని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నువ్వు చిల్లరగానివా.. సీఎంవా? అని ప్రజలు అనుకునే పరిస్థితి ఏర్పడిం దని.. ఒక సీఎం స్థాయిలో ఉండి చిల్లర మాటలు మాట్లాడుడు బంద్ చేయా లని హెచ్చరించారు. కేసీఆర్ మీడియా సమావేశంలో.. ఏం మాట్లాడారో నీకు అర్థమైందా అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తిరిగి వచ్చిన సందర్భంగా రెండేళ్ల కాలంలో నువ్వు ఏం చేశావని ప్రశ్నిస్తే, వాటికి సమాధానం చెప్పలేక ఫ్రస్టేషన్తో చిల్లర మాటలు మాట్లాడుతున్నావన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించి పది శాతం పనులు కూడా పూర్తి చేయని, చేతగాని ప్రభుత్వం నీదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను పట్టుకొని నీ అమ్మ అనడంతో మహిళ పట్ల నీకున్న గౌరవం ఏంటో తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. మహిళల జోలికి వచ్చిన, మహిళలను కించపరిచిన ఏ ఒక్కడు కూడా బతకలేదని, భూస్థాపితం అయ్యారన్నారు. నిన్ను భూస్థాపితం చేసే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి మంచి భాషను నేర్పించాల్సిందిగా ఐఏఎస్ ఆఫీసర్లను కోరారు. ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చి గద్దెనెక్కి 420 హామీలను నెరవేర్చకుండా ఏమి చేయాలో పాలుపోక మతిభ్రమించి ఇష్టం వచ్చినట్లు ముఖ్యమంత్రి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. డిసెంబర్ నెలలో వేయాల్సిన రైతుబంధు వేయాలని, ప్రజలకు కల్యాణలక్ష్మి పైన తులం బంగారం ఇస్తానన్న మాటను నెరవేర్చాలన్నారు. 2000 పెన్షన్ 4000 కు ఇస్తానన్న హామీని నెరవేర్చాలని.. ఇవేమీ చేయకుండా కేవలం పిచ్చి కూతలు కూస్తూ.. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే.. బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. 2029లో నీ పార్టీని ప్రభుత్వాన్ని ప్రజలు భూస్థాపితం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్తో పాటు కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్వీ నాయకులు చుక్క శ్రీనివాస్, బొంకురి మోహన్, నాయకులు మాచర్ల వినయ్, నవీన్ రావు, మామిడి తిరుపతి, పూదూరి మల్లేశం, తౌటు మురళి, వెంకట రమణారెడ్డి, ఆకుల మధుసూదన్, రాజేందర్రెడ్డి, విజయేందర్ రెడ్డి, చుక్కారెడ్డి, గడ్డం స్వామి, కొత్త గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులు మూసివేయాలని వినతి

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో మద్యం ఏరులై పారుతున్న నేపథ్యంలో చాలా కుటుంబాలు రోడ్డున పడుతు న్నారు. అంతే కాకుండా ముఖ్యంగా మహిళలు, సాయంత్రం అయ్యిందంటే రోడ్డు మీద తిరగలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడ ఎవరు మద్యం తాగి ఉన్నారో, ఎవరు ఎలా అసభ్యకరంగా, ప్రవర్తిస్తారో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మన గ్రామంలో బెల్ట్ షాపులు మూసివేయాలని శుక్రవారం గ్రామ పంచాయతీ పాలకవర్గానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చలో కలెక్టరేట్ విజయవంతం చేయండి



- 252 జీవోను సవరించే వరకు పోరాటం ఆగదు.
- జర్నలిస్టులు హక్కులను కాల రాస్తే సహించేది లేదు
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయక్ పాషా

**వేద న్యూస్, వేములవాడ:**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూ జే హెచ్ 143 రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తలపెట్టిన నేటి చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూ జే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం విడుదల చేసిన నూతన జీవో 252 వర్కింగ్ జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా ఉందని మండిపడ్డారు. నూతన జీవో ప్రకారం డెస్క్ జర్నలిస్టులు, కేబుల్ జర్నలిస్టులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కులను, సంక్షేమాన్ని కాలరాసే విధంగా ప్రభుత్వం అనుసరించినట్లయితే సహించేది లేదని ధ్వజమెత్తారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో విస్మరించారన్నారు. మెజారిటీ జర్నలిస్టుల సహకారంతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం అంతకంటే దారుణంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నూతనంగా విడుదల చేసిన జీవో నెంబర్ 252 ను వెంటనే సవరించాలన్నారు. లేకుంటే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ నేతృత్వంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృత పరుస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రేగుల రాంప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిపాక నరసయ్య, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, అబ్దుల్ జబ్బర్, దేబ్బేటి ప్రవీణ్, చేకూర్తి నవీన్ పాల్గొన్నారు.

# వ్యాధులతో వీధుల్లో కుక్కల స్వైర విహారం

- భయాందోళనలో స్థానిక ప్రజలు

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పట్టణంలోని పలు ప్రాంతాల్లో వింత వ్యాధితో వీధి కుక్కలు స్వేచ్ఛగా తిరగడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కొన్ని కుక్కలు తీవ్రమైన చర్మ వ్యాధులు, గాయాలతో ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్లపై బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వ్యాధిగ్రస్త కుక్కల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి వెటర్నరీ విభాగంతో సమన్వయం చేసుకొని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వ్యాధిగ్రస్త కుక్కలను గుర్తించి పట్టుకొని చికిత్స అందించడంతో పాటు, వ్యాధి మరింత వ్యాపించకుండా నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రతతో పాటు మూగజీవుల సంరక్షణ కూడా మున్సిపాలిటీ బాధ్యతేనని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేటితో సీపీఐకి వందేళ్లు పూర్తి

- కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి ఆశయ సాధనలో ముందుకు వెళ్తాం
- మండల కార్యదర్శి కామ్రేడ్ తీపిరెడ్డి తిరుపతి రెడ్డి



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఈ రోజు నాటికి 100సంవత్సరాల సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కామ్రేడ్ తీపిరెడ్డి తిరుపతి రెడ్డి జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26 న కన్పూర్ సీపీఐ పార్టీ ఆవిర్భావం జరిగిన నాటి నుంచి దేశ స్వతంత్ర పోరాటంతో పాటు, హక్కుల కోసం కూడా బ్రిటిష్ వారితో పోరాటాలు చేసిందన్నారు. తెలంగాణా విలీనం కోసం రైతాంగ సాయుధ పోరాటం చేసి లక్షలాది ఎకరాల భూమి పంచి, నిజాం నిరంకుశ పాలనను అంతం చేసిందని గుర్తు చేశారు. ఈ రోజున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సైతం కార్మిక హక్కులు, జీవోల అమలు కోసం పోరాటం చేస్తోందని, కనీస వేతనాలు, కార్మికులు, ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయాలని, కనీసం వేతనం 26 వేలు ఇవ్వాలని పోరాటలు చేస్తోందన్నారు. 100 సంవత్సరాలు గడిచిన నూతనోత్సాహంతో ముందుకు వెళుతోందని, జనవరి 3న జిల్లాలో 100 సంవత్సరాల సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జనవరి 18న ఖమ్మంలో 5 లక్షల మందితో ముగింపు సభ ఉంటుందని, 40 దేశాల నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంద అనిల్ కుమార్, కౌన్సిల్ సభ్యుడు సావనపెల్లి మల్లేశం, మండల నాయకుడు ముత్యాల మల్లారెడ్డి, జుట్టు అఖిల్, వేములవాడ హరీష్, సావనపెల్లి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ కలిసిన ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు

**వేద న్యూస్, శాయంపేట:**



హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో పత్తిపాక గ్రామానికి చెందిన నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు ఎస్సై జక్కుల పరమేశ్వర్ ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, స్థానిక సమస్యలపై చర్చించి ఎస్సైని శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా, అభివృద్ధి దిశగా నడిపించాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఉపసర్పంచ్ తుడుం రాజు, వార్డ్ మెంబర్లు కొడిమాల మహేందర్, గజ్జి రమేష్, గజ్జి రాజు, పోతుగంటి ప్రమీల-సారయ్య, అంకేశ్వరపు సాయిలక్ష్మి-మొగిలి, తుడుం స్రవంతి-రాజు, కాంగ్రెస్ వార్డ్ మెంబర్లు గడ్డమీది హారతి-కర్ణాకర్, ఐరబోయినబోయిన స్వప్న-రాజు, కందకట్ల ప్రవీణ్ కుమార్, నాలికే వీరప్రతాప్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు పసుల ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు పొడిశెట్టి గణేష్ , చల్లా సమ్మిరెడ్డి, పెద్దిరెడ్డి ఆదిరెడ్డి, పెండల కిరణ్, పొతుగంటి సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం డిసెంబర్ 27, 2025

# సాహిబ్జాదాల జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం



- వీర బాల్ దివస్ సందర్భంగా గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు
- ఎంపీ ఈటెల రాజేందర్
- సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఘనంగా కార్యక్రమం

**వేద న్యూస్, సికింద్రాబాద్:**

చిన్న వయసులోనే అపార ధైర్యం, త్యాగస్ఫూర్తిని చాటిన సాహిబ్జాదాల జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, ధర్మం కోసం నిలబడటం, అన్యాయానికి ఎదురొడ్డి పోరాడటం భారతీయ సంస్కృతికి మూలస్తంభాలని ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ధర్మ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అచంచల ధైర్యంతో త్యాగం చేసిన గురు గోవింద్ సింగ్ కుమారులు సాహిబ్జాదా జోరావర్ సింగ్, సాహిబ్జాదా ఫతే సింగ్ త్యాగాలను స్మరించుకుంటూ వీర బాల్ దివస్ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని గురుద్వారా షాహిద్లో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు యువతలో విలువలు, దేశభక్తిని పెంపొందిస్తాయని అన్నారు. గురుద్వారాలో నిర్వహించిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో సాగాయి. సాహిబ్జాదాల త్యాగ గాథలను గుర్తు చేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం పాల్గొన్న ప్రతి ఒక్కరిలో దేశభక్తి, ధర్మ నిబద్ధతను మరింత బలపరిచింది. సమాజంలో ఐక్యత, సహనం, త్యాగస్ఫూర్తిని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వీర బాల్ దివస్ కన్వీనర్ పూస రాజు, కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు బనుక నర్మదా మల్లికార్జున్, కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్, డివిజన్ అధ్యక్షులు జితేందర్ గుప్తా, మైనారిటీ విభాగం అధ్యక్షులు జగన్ మోహన్ సింగ్, రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి, రాష్ట్ర మహిళా మోర్చా సంయుక్త ఖజానాదారు విశాలిని, అసెంబ్లీ కన్వీనర్ విజయానంద్, జిల్లా ఇంచార్జీ నందనం దివాకర్, వార్డు అధ్యక్షులు రాకేష్, శ్రవణ్, ప్రతీక్, అశోక్, అరుణ్‌తో పాటు సీనియర్ నాయకులు టోపీ శంకర్, భారత్ సింహా రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోయర్ మానేరు బ్యాక్ వాటర్‌లో పూడికతీత

- అధునాతన సాంకేతికతతో సాగునీటి నిర్వహణ
- ఇసుక క్వారీల పనితీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా
- రేణుకుంట వద్ద క్షేత్రస్థాయి సమీక్ష



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లా రేణుకుంట వద్ద లోయర్ మానేరు డ్యామ్ బ్యాక్ వాటర్ ప్రాంతంలో కొనసాగుతున్న పూడికతీత పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న ఈ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూడికతీత ద్వారా డ్యామ్ నీటి నిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు సాగునీటి లాభాలు చేకూరుతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిశీలనలో సహచర మంత్రి వివేక్ వెంకట్ స్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. పూడికతీత పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆధునిక యంత్రాలు, సాంకేతికత వినియోగంతో దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధ్యమవుతాయని తెలిపారు. అనంతరం ఆధునాతన సాంకేతికతతో నిర్వహిస్తున్న ఇసుక క్వారీలను మంత్రి పరిశీలించారు. ఇసుక తవ్వకాలలో పారదర్శకత, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ నిబంధనల అమలు తీరుపై అధికారులను ప్రశ్నించారు. సాంకేతిక వ్యవస్థల ద్వారా అక్రమాలకు తావు లేకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలతో ఇరిగేషన్ రంగం ఆధునికీకరణ దిశగా ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సహజ వనరుల సద్వినియోగం, రైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు వెల్లడించారు.

# జడ్చర్లలో కాంగ్రెస్‌కు షాక్..

- 150 మంది బీఆర్ఎస్‌లో చేరిక
- ఎర్రవల్లి నివాసంలో కేటీఆర్ సమక్షంలో పార్టీలోకి స్వాగతం
- మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చేరికలు

**వేద న్యూస్, మహబూబ్‌నగర్:**



జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మొత్తం 150 మంది శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చేరికైన వారిని గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ చేరికలతో జడ్చర్ల రాజకీయాల్లో బీఆర్ఎస్ బలం మరింత పెరిగిందని పార్టీ నేతలు తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గం నవాబుపేట మండలానికి చెందిన వెంకటేశ్వర తండా గ్రామస్తులు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్సులలో ఎర్రవల్లి నివాసానికి చేరుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ను కలిశారు. పార్టీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించిన అనంతరం బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన బాబు నాయక్‌తో పాటు, ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఉప సర్పంచ్ తావూరియా, ఆరుగురు వార్డు సభ్యులు మరియు పలువురు గ్రామస్తులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ మే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని పేర్కొంటూ, కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జడ్చర్ల నియోజ కవర్గంలో బీఆర్ఎస్‌ను మరింత బలంగా నిలబెట్టే దిశగా అందరూ సమిష్టిగా పనిచేయాలని ఆయన సూచించారు.

# మన్మోహన్ సింగ్ తొలి వర్ధంతి

- జూబ్లీహిల్స్ నివాసంలో ఘన నివాళులు
- మహనీయుడి సేవలను స్మరించిన సీఎం రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ తొలి వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి పాల్గొని మహనీయుడికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించిన డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. నిస్వార్థ సేవ, వినమ్రత, ఆర్థిక విజ్ఞానం ఆయన ప్రత్యేకతలని గుర్తుచేశారు. దేశ అభివృద్ధికి ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందని, ప్రజాసేవలో ఆయన చూపిన నిబద్ధత ప్రతి ప్రజాప్రతినిధికి మార్గదర్శకమని ఈ సందర్భంగా నేతలు అభిప్రాయపడ్డారు.

# కేజీబీవీ విద్యార్థినికి అస్వస్థత..

**నాగర్‌కర్నూల్ వేద న్యూస్ :**

నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని భాను గురువారం స్వల్ప అస్వస్థతకు గురైంది. విషయం గమనించిన పాఠశాల నిర్వాహకులు బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి దవాఖానలో చికిత్స చేయించి ఇంటికి పంపించారు. విద్యార్థికి డైజేషన్ కాకపోవడంతో స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలిపారు.అయితే ఇంటికి వెళ్లాక కూడా మళ్లా అస్వస్థతకు గురికాగా.. కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించి చికిత్స చేయించగా.. శ్వాస సంబంధ వ్యాధిగా వైద్యులు గుర్తించారు. కాగా, గురువారం ఉదయం అల్పాహారంలో బోండాలు తినడంలో ముగ్గురు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు సోషల్ మీడియాతోపాటు, కొన్ని దినపత్రికల్లో వచ్చిన వార్తపై శుక్రవారం కలెక్టర్ సంతోష్ స్పందించారు. జిల్లా అధికారులను కేజీబీవీని సందర్శించి సమగ్ర నివేదికను తెప్పించి పరిశీలించారు.

# నూతన ప్రజాప్రతినిధులకు సన్మానం

**వేద న్యూస్, శాయంపేట:**



హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్ గజ్జి ఐలయ్య.. ఉప సర్పంచ్ తుడుం రాజు , వార్డ్ మెంబర్లకు పత్తిపాక ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మసీదులో శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం పెద్దలకు సర్పంచ్, ఉప సర్పంచ్లు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు గజ్జి రాజు, అంకేశ్వరపు సాయిలక్ష్మి-మొగిలి, కోడిమాల మహేందర్, గజ్జి రమేష్, చిట్టిరెడ్డి పద్మ-జంగారెడ్డి, జామ మస్జిద్ అంజుమ్ ఫరీద్, పతిపాక ముస్లిం కమిటీ ఇమామ్ కుర్షీద్ ఆలం, సదర్, ఎండి అఫ్జల్, నాయబ్ సదర్ ఎండి రహీం, సెక్రటరీ ఎండి అక్బర్, జాయింట్ సెక్రటరీ ఎండి అక్రమ్, నాయకులు పెద్దిరెడ్డి ఆదిరెడ్డి, పెండెల కిరణ్, పోతుగంటి సాంబరాజు, ఎండి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన లయన్ చొప్పరి జోన్ సోషల్ కార్యక్రమాలు

**వేద న్యూస్, శాయంపేట:**




అంతర్జాతీయ లయన్స్ క్లబ్ 320ఎఫ్ వరంగల్ జిల్లా రీజియన్4, జోన్3కి చెందిన జోన్ చైర్ పర్సన్ లయన్ చొప్పరి సోమయ్య ఆధ్వర్యంలో చొప్పరి జోన్ సోషల్ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. జోన్ పరిధిలో ఉన్న క్లబ్లు శాయంపేట మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మొదటి ఉప జిల్లా గవర్నర్ లయన్ ఎన్. సుధాకర్ రెడ్డి, రెండవ ఉప జిల్లా గవర్నర్ లయన్ పి. హరికిషన్ రెడ్డి, మాజీ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ లయన్ వెంకట్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్లు డా. కె. సుధాకర్ రెడ్డి, ముచ్చ రాజిరెడ్డి, జి ఎస్ టి కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి, జయంతి కోఆర్డినేటర్ టి వెంకట్ రెడ్డి పలువురు జిల్లా క్యాబినెట్ సభ్యులు, గ్లోబల్ యాక్షన్ కొలాబరేటివ్ టీమ్ నాయకులు పాల్గొన్నారు. హనుమకొండ థౌజెండ్ పిల్లర్స్, ఆత్మకూరు దేశాయ్, ఆపద్బంధు, హనుమకొండ న్యూ శాయంపేట క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులురులు, ఇతర క్లబ్బుల జోన్ చైర్‌పర్సన్లు, రీజియన్ చైర్‌పర్సన్ లయన్ ఊరుకొండ రాజేందర్, దుస్స శివశంకర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆటపాటలు, లేడీ లయన్ల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఆటలు, పాటలతో ఉత్సాహంగా సాగాయి. సభ్యులందరూ ఆనందోత్సాహాలతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గచ్చిబౌలిలో ఘోర రోడ్డు ప్రమాదం

- అతివేగానికి యువ సాఫ్ట్‌వేర్ మృతి
- స్నేహితుడికి స్వల్ప గాయాలు




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

నగరంలో మరో విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగం ఓ యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణాన్ని బలి తీసుకుంది. గచ్చిబౌలిలో జరిగిన ఈ ప్రమాదంలో వరంగల్ జిల్లాకు చెందిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పునీత్ యాదవ్ (23)గా పోలీసులు గుర్తించారు. వరంగల్ జిల్లా వాసి అయిన పునీత్, గౌలిదొడ్డిలోని ఓ హాస్టల్‌లో నివసిస్తూ గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై తన స్నేహితుడితో కలిసి గౌలిదొడ్డి నుంచి గచ్చిబౌలికి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పునీత్ అతివేగంగా బైక్ నడపడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఈ ఘటనలో బైక్‌ను నడుపుతున్న పునీత్ యాదవ్‌కు తీవ్ర గాయాలు కాగా, అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న అతడి స్నేహితుడు మాత్రం స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడిని సమీప ఆస్పత్రికి తరలించారు. పునీత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో పెరుగుతున్న అతివేగం ప్రమాదాలకు కారణమవుతుండటంపై పోలీసులు మరోసారి హెచ్చరికలు జారీ చేశారు.

# సిగ్నల్ జంప్ చేస్తే ఇకపై డబుల్ ఫైన్

- ట్రాఫిక్ నియంత్రణకు తెలంగాణ పోలీసుల కఠిన చర్యలు
- నగరాల్లో పెరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట
- నిబంధనలు పాటిస్తేనే రోడ్డు భద్రత

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




రహదారులపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను నియంత్రించేందుకు తెలంగాణ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సిగ్నల్ జంప్ చేసిన వాహనదారులపై ఇకపై రెట్టింపు జరిమానా విధించనున్నట్లు స్పష్టం చేశారు. నగరాల్లో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ గందరగోళాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఎరుపు వెలుగు ఉన్నప్పటికీ వాహనాలు ముందుకు వెళ్లడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు, ఆటో, కార్ల డ్రైవర్లు నిబంధనలు లెక్కచేయకపోవడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. సిగ్నల్ జంప్ చేయడమే కాకుండా, అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేయడం, జీబ్రా క్రాసింగ్ వద్ద వాహనాలు ఆపకపోవడం, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పట్టించుకోకపోవడం వంటి ఉల్లంఘనలపైనా కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో పర్యవేక్షణను పెంచి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వెంటనే జరిమానాలు విధించనున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించుకోవచ్చని, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని తెలంగాణ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. క్రమశిక్షణతో వాహనాలు నడిపి, ఇతరుల ప్రాణాలను కాపాడడంలో భాగస్వాముల కావాలని కోరారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073